www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 23 ఫిబ్రవరి 2023



ఎన్నికల అబ్జర్వర్ల నియామకం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముగ్గురు అబ్జర్వర్లను నియామకం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం, నెల్లూరు. చిత్తూరు గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కె.సునీత ఐఏఎస్ ,ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కోన శశిధర్ ఐఏఎస్‌ను, స్థానిక సంస్థల ఎం ఎల్ సి ఎన్నికల పరిశీలకులుగా బి. శ్రీధర్ ఐఏఎస్‌ను నియమించింది.

శాసనమండలిలో మీ 'గొంతుక' అవుతాం..!

మీ సమస్యలే.. మా అజెండా..!

- మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, పి.బాబురెడ్డి నామినేషన్
- సంఘీభావం ప్రకటించిన విఠపు, లక్ష్మణరావు
- తరలొచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు
- చిత్తూరులో వేలాదిమందితో ర్యాలీ, సభ



నామినేషన్ వేస్తున్న అభ్యర్థులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, బాబురెడ్డి



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

'నాలుగేళ్లుగా పిఆర్‌సి ఇవ్వలేదు, డిఎలు ఇవ్వలేదు కనీసం జీతాలు కూడా ఒకటో తేదీ వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.. ఆఖరుకు ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించలేదు.. ఏం మొహం పెట్టుకుని ఎంఎల్‌సి ఓటడిగేందుకు అధికార పార్టీ వస్తుంది.. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలను శాసనమండలిలో వినిపిస్తాం.. మీ సమస్యలే మా అజెండా' అంటూ పిడిఎఫ్ అభ్యర్థులు పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సిలు విఠపు బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావులు ఉద్ఘాటించారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడనేది ఎంత వాస్తవమో, పిడిఎఫ్ అభ్యర్థుల విజయం అంతే వాస్తవమని అన్నారు. 'పదండి ముందుకు.. పదండి తోసుకు' అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు వేలాదిగా జిల్లాకేంద్రమైన చిత్తూరుకు తరలివచ్చారు.. పోరాటాల పీడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలనే ఆశయం వారి మోహాల్లో కనిపించింది. వారి రాకతో కట్టమంచి ప్రాంతం జనసంద్రమయ్యింది. తూర్పు రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి పోటీ చేసేందుకు పిడిఎఫ్ అభ్యర్థులు పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డిలు బుధవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. తమ ఉద్యమ గొంతుకలను గెలిపించేందుకు ఉదయం ఎనిమిది గంటలకే ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. పిల్ల కాలువలన్నీ సముద్రంలో కలిసినట్లు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి యుటిఎఫ్, ఎస్‌టియు, టిటిడి ఇతర ఉపాధ్యాయ, కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జనం కదిలొచ్చారు. పదిన్నర గంటల ప్రాంతంలో ర్యాలీ ప్రారంభమయ్యింది. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు విటపు బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్. ప్రసాద్, సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి, ఎంఎల్‌సి అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి. బాబురెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు శ్రీదేవీ, ఎఐటియుసి నాయకులు రామానాయుడు, మురళిలు ప్రదర్శన ముందు భాగాన నడవగా మిగిలిన కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి వెంట నడిచారు. కట్టమంచి చెరువు నుంచి గాంధీవిగ్రహం వరకు దాదాపు రెండు కిలోమీటర్ల పొడవు ర్యాలీ ముందుకు సాగుతూ వెళ్లింది. ఈ సందర్భంగా లాంగ్ లీవ్ పిడిఎఫ్.. గెలవాలి.. గెలవాలి పిడిఎఫ్ అభ్యర్థులు గెలవాలి.. విజయం ఉద్యమ అభ్యర్థులదే అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీ హైరోడ్డు మీదుగా గాంధీవిగ్రహం, ఎంఎస్ఆర్ కూడలి మీదుగా నాగయ్య కళాక్షేత్రం వరకు సాగింది. అనంతరం అక్కడ బహిరంగ సభ జరిగింది. సభ మధ్యలో ఎంఎల్‌సి అభ్యర్థులు ఇరువురూ వెళ్లి కలెక్టరేటులో నామినేషన్లను దాఖలు చేశారు.

పిడిఎఫ్‌దే విజయం

గతంలో లాగే ఈ సారీ పిడిఎఫ్ అభ్యర్థులే ఈ తూర్పు రాయలసీమ ప్రాంతంలో విజయం సాధించనున్నారనని, ఇందులో ఎలాంటి సందేహం లేదని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. పీడీఎఫ్ ఎంఎల్‌సిల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నాగయ్య కళాక్షేత్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక, విద్యార్థి, యువజన వేదిక ఆధ్వర్యంలో 'జాతీయ విద్యా విధానం.. రాష్ట్ర విద్యారంగంపై పరిణామాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. జేవివి రాష్ట్ర అధ్యక్షులు మురళిధర్ అధ్యక్షత వహించారు. నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు భారీ ఎత్తున కార్లతో ర్యాలీ నిర్వహిస్తే.. తాము జనం కాళ్లతో మట్టిపై ర్యాలీ నిర్వహించామని తెలిపారు. తమ నిరాడంబరతకు ఇదే నిదర్శనమని చెప్పారు. గతం కన్నా తమకు బలం పెరిగిందని, ఈ సారి భారీ ఎత్తున ప్రయివేటు ఉపాధ్యాయులు మద్దతుగా నిలిచారని పేర్కొన్నారు. ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ వైసిపి ఏ ముఖం పెట్టుకుని ఉపాధ్యాయులను, ఉద్యోగులను ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. నాలుగేళ్లుగా పిఆర్‌సి ఇవ్వలేదు, డిఎలు ఇవ్వలేదు కనీసం జీతాలు కూడా ఒకటో తేదీ వచ్చే పరిస్థితి లేకుండా పోయిందని దుయ్యబట్టారు. ఆఖరుకు ఒక్క డిఎస్‌సి కూడా ఇవ్వలేకపోయారని వాపోయారు. అధికార పార్టీ ఏకంగా శాసనమండలిని రద్దు చేస్తామని చెప్పి, ఇపుడు అభ్యర్థులను పోటీకి పెట్టడం వారి ద్వందరీతికి నిదర్శనమన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ సూర్యుడు తూర్పున ఉదయిస్తాడనేది ఎంత వాస్తవమో, పిడిఎఫ్ అభ్యర్థుల విజయం కూడా అంతే వాస్తవమని తెలిపారు. పట్టబద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మూడు జిల్లాలోని ఓటర్లను కలిసే శక్తి సామర్థ్యాలు ఒక్క పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతు ఇస్తున్న ప్రజా సంఘాలకు మాత్రమే ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా సిఐటియు నాయకులు వాడ గంగరాజు, అన్నమయ్య జిల్లా సిఐటియు నాయకులు శ్రీనివాసులు, చిత్తూరు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, ఐద్వా నాయకురాలు సాయి లక్ష్మి, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జివి రమణ, ఎఐటియుసి నాయకులు మురళి, నాగరాజు, రైతు సంఘం నాయకులు రామానాయుడు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా కమిటిసభ్యులు, ఎస్‌టియు నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి

చిత్తూరు ఎమ్మార్వో తొలగింపు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల విధులు నుంచి చిత్తూరు ఎమ్మార్వో పార్వతిని తొలగిస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. హరినారాయణన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో చిత్తూరుకు చెందిన రంగారావు తన ఓటును ఉద్దేశపూర్వకంగా చిత్తూరు ఎమ్మార్వో తొలగించారంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిత్తూరు ఎమ్మార్వో పార్వతిని ఎన్నికల విధుల నుండి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులను జారీ చేశారు.

28 వరకు ఈకేవైసికి అవకాశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రబీ 2022-23కు సంబంధించి చిత్తూరు జిల్లాలో పంట సాగుచేసిన రైతులందరూ ఈ-పంట, ఈకేవైసి నమోదు చివరి తేదీ ఈనెల 28 వరకు అని సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడి మురళికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంటల భీమా, పంట నష్ట పరిహారం, సున్నా వడ్డీ, పంట రుణాలు మొదలగు పథకాలు ఈ పంట, ఈకేవైసి చేసుకున్న రైతులు మాత్రమే అర్హులని తెలిపారు. కావున పంట సాగుదారు రైతులందరూ ఈ పంట ఈకేవైసి సంబంధిత రైతు భరోసా కేంద్రాల వద్ద ఖచ్చితంగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

స్పందన అర్జీలను 24 గంటలలో అప్లోడ్ చేయాలి: జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్పందనలో అందిన అర్జీలను 24గంటలలో అప్‌లోడ్ చేయాలని జిల్లా జాయింట్‌కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ నుండి స్పందన, సచివాలయం ద్వారా ప్రజలకు అందించే సేవలు, ఎఫ్ఆర్ఎస్ సంబంధించి డిఆర్ఓ, జడ్పీ సీఈఓ, అన్ని శాఖల జిల్లా అధికారులు తహాశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండలాల స్థాయి స్పందన టీమ్స్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా జేసి మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను 24 గంటల్లో అప్‌లోడ్ చేసి, 48 గంటలో క్లియర్ చేయాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలను సంబంధితశాఖలకు వెంటనే పంపాలన్నారు. ఎంపీ ఎఫ్ఆర్ఎస్ యాప్‌కు సంబంధించి అన్ని శాఖల జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని హాజరు నమోదు చేసేలా చూడాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రాలలోనే పోలింగ్ కేంద్రాలు తహాశీల్దార్లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, నీటి వసతి, అన్ని రకాల మౌలిక సదుపాయాలు, ఉండేవిధంగా తహాశీల్దార్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయశాఖ అధికారి మురళికృష్ణ, డిఆర్డీఏ, డ్వామా పిడిలు తులసి, గంగాభవాని, సాంఘిక సంక్షేమశాఖ అధికారిణి డాక్టర్ రాజ్యలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకట రమణారెడ్డి, డిపిఓ లక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసి

టిడ్కో గృహాలకు రుణాల ప్రక్రియ పూర్తిచేయండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: టిడ్కో గృహాలకు సంబంధించి రుణాల మంజూరు ప్రక్రియను బ్యాంకర్లు త్వరగా పూర్తిచేయాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ కోరారు. బుధవారం మధ్యాహ్నం నగరపాలక సంస్థ పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గహ సముదాయాలను, పూర్తిచేసిన పనులను బ్యాంకర్లకు చూపించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర కమిషనర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని లక్ష్యంతో టిడ్కో గహాలను నిర్మిస్తుందన్నారు. ఇందులో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి బ్యాంకర్లు రుణాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. 365, 430 చదరపు అడుగుల గహాలకు సంబంధించి బ్యాంకర్లు ఇప్పటికే 75శాతం రుణాలు మంజూరు చేయడం జరిగిందని, మిగిలిన 25శాతం రుణాలను మార్చి కల్లా పూర్తిచేస్తే రిజిస్ట్రేషన్, మార్ట్ గేజ్ ప్రక్రియను పూర్తి చేయిస్తామన్నారు. మౌలిక వసతులు, సివిల్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని ఈ దశలో మిగిలిన రుణాలను మంజూరు చేయాలన్నారు. నిరుపేదల కోసం నిర్మించిన 300 చదరపు అడుగుల గహాల పనులు పూర్తయ్యాయని రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేసినట్లు వివరించారు. ఈసమావేశంలో మెప్మా పీడీ రాధమ్మ, ఎల్డీఎం శేషగిరిరావు, టిడ్కో ఈఈ వెంకటముని, ఎసీపీ రామకష్ణుడు, సీఎంఎం గోపి, బ్యాంకర్లు పాల్గొన్నారు.

చీటి డబ్బు ఇవ్వలేదని వ్యాపారి ఆత్మహత్య

పరారీలో అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు
ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన

ప్రజాశక్తి - తిరుచానూరు

చేసిన పాపం పోగొట్టుకోడానికి, పుణ్యం మూటగట్టుకోడానికి భక్తులు దేవుని సన్నిధికి వస్తారు. అయితే దేవుని సన్నిధిలో ఉండే ఆలయ ప్రధాన అర్చకుడు సతీ సమేతంగా చీటీ డబ్బులు ఎగవేసి కోట్లాది రూపాయలు దండుకుని పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో కీలక సూత్రధాని తిరుచానూరు అమ్మవారి ఆలయంలోని ప్రధాన అర్చకుడే నిందితుడు కావడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి.

చీటి డబ్బులు ఇవ్వకుండా ఏళ్ల తరబడి వేధిస్తున్న చీటి నిర్వాహకుని తీరుతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరుచానూరు పంచాయతీ ఎస్వీపి కాలనీలో చోటు చేసుకుంది. తిరుచానూరు సిఐ కథనం మేరకు...తిరుచానూరు పంచాయతీ ఎస్వీపి కాలనీ కి చెందిన నితిన్ స్థానికంగా ప్రొవిజన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన అవసరాల నిమిత్తం ఇంటి పరిసరాల్లో నమ్మకంగా చీటిలు నిర్వహిస్తున్న వాణి, ఆమె భర్త ప్రతాప్ స్వామి అలియాస్ బాబు స్వామి(అమ్మవారి ఆలయం ప్రధాన అర్చకులు) వద్ద పెద్ద మొత్తంలో చీటీలు వేసాడు. చీటీ గడువు ముగిసి మూడేళ్లు గడుస్తున్నా తనకు రావాలిసిన డబ్బులు ఇవ్వకుండా దంపతులు ఇద్దరు రోజుకో మాట చెబుతుండేవారు. దీంతో అడిగి అడిగి విసిగి వేసారిన నితిన్ మనస్తాపం చెంది తన చావుకు కారణం చీటి నిర్వహిస్తున్న దంపతులే కారణమంటూ లేఖ రాసి ఆదివారం తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు సోమవారం తిరుచానూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. నితిన్ చావుకు కారణమైన చీటి నిర్వాహకులు వాణి, ఆమె భర్త ఆలయ అర్చకులు బాబు స్వామి పై కేసు నమోదు చేశారు. నిందితులు ఇద్దరు ఇంటికి తాళం వేసి పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సిపాయికి 'సై'..ఎస్సీవీకి 'నై'

వన్నెకుల ఓట్ల కోసం ఎమ్మెల్సీ ఎర..!!
మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీకి రిక్తహస్తం
శ్రీకాళహస్తిలో మారుతున్న రాజకీయాలు



సిపాయి సుబ్రమణ్యం



ఎస్సీవీ నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రోజు రోజుకూ రాజకీయ సమీకరణలు మారిపోతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీలు వచ్చే సాధారణ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అందులో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక ఓటు శాతం ఉన్న వన్నె కుల క్షత్రియులే(పల్లె రెడ్లు) లక్ష్యంగా ఆ రెండు ప్రధాన పార్టీలు ముందుకెళ్తుండటం గమనించాల్సిన అంశం. ఈ క్రమంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ టీడీపీ ఓ అడుగు ముందుకేసి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత సత్రవాడ మునిరామయ్యకు వల వేసి విజయవంతమైంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో సత్రవాడ మునిరామయ్యకు టీడీపీ కండువా కప్పి ఏకంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ పెద్దన్న పోస్టును కట్టబెట్టింది. అదేవిధంగా సత్రవాడ కుమారుడు ప్రవీణ్ ను సైతం పార్టీలోకి ఆహ్వానించి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఇది జరిగి గరిష్టంగా పది రోజులు గడవకముందే అధికార పార్టీ వైసీపీ ఏకంగా పది అడుగులు ముందుకేసి రష్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వన్నెకుల క్షత్రియ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు వల విసిరింది. ఆయన వైసీపీ లో చేరకుండానే స్థానిక సంస్థల(ఎమ్మెల్సీ)ఎన్నికల్లో స్థానం కల్పిస్తూ వైసీపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో వన్నె రెడ్ల సామాజిక వర్గం సంబరాల్లో మునిగిపోతుండగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీకి, ఆయన అనుచరగణానికి మింగుడుపడని అంశం. ఇదంతా రాజకీయ ఎత్తుగడలో భాగంగానే జరుగుతోందనీ, తన రాజకీయ లబ్ది కోసం స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఎన్నో ఏళ్లుగా పార్టీని అంటి పెట్టుకున్నవారినీ, సీనియర్లను సైతం విస్మరిస్తూ కొత్తగా పార్టీలో చేరుతున్న వారిని అందలమెక్కిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

'ఎన్ని జరిగినా మౌనంగా ఎస్సీవీ'

మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడుకు శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల్లో బలమైన పట్టుంది. 2019 ఎన్నికల్లో ఆ నియోజక వర్గాల్లో వైసీపీ గెలుపు బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. అయితే ఎస్సీవీ జగన్ కు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా జగన్ ఎస్సీవీకి ఇచ్చిన హామీని మాత్రం పెడ చెవిన పెట్టినట్లుగా జరుగుతున్న పరిణామాలను చూస్తే అర్థమవుతోంది. దీంతో ఎస్సీవీ వర్గీయులు లోలోన రగిలి పోతున్నారు. అందుకు కారణం కూడా లేకపోలేదు. శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడుకు ఈ దఫా శాసనమండలిలో పదవి తప్పకుండా ఇస్తానని ఇటీవల రేణిగుంట విమానాశ్రయంలో సీఎం జగన్ ఎస్సీవీకి హామీ ఇచ్చారు. అయినా చివరకు ఎస్సీవీకి మొండి చెయ్యే చూపించారు

శాసనసభ ఎన్నికల తరువాత ఓ ప్రణాళిక ప్రకారం ఎస్సీవీ నాయుడు వర్గానికి క్రమేణా ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. నియోజకవర్గంలో ఆయన చెప్పే పనులు ఏవీ జరగకుండా చేశారు. అయినా పెద్దాయన ఎక్కడా అసమ్మతి గళం విప్పలేదు. స్థానికంగా తనకు ప్రాధాన్యత ఇవ్వకపోయినా ఎంతో సహనం పాటిస్తూ వచ్చారు. ఇందుకు కారణం అధిష్టానం హామీ. మొదటి విడతలోనే ఎస్సీవీ నాయుడుకు శాసనమండలి పదవి ఇస్తారని అందరూ భావించారు. అయితే మొదటి విడతలో ఆయనకు పదవి దక్కలేదు. అయినా ఆయన పెదవి విప్పలేదు. మరో అవకాశం కోసం ఎదురు చూశారు. రెండవ దఫా తప్పకుండా ఎస్సీవీకి శాసనమండలి పదవి వస్తుందని ఆయన అనుచర వర్గం ఆశతో ఎదురు చూసింది. ఇంతలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను కొంతమంది అధికార పార్టీ నేతలు బరిలోకి తీసుకు వచ్చారు. ఆగమేఘాలపై తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయించారు. వన్నెకుల క్షత్రియ కులానికి చెందిన ఓట్లు తిరుపతి జిల్లాలో వైసీపీకే గంపగుత్తగా పడతాయని చెప్పి సిపాయికి స్థానిక సంస్థల కోటాలో శాసనమండలి పదవి ఇచ్చారు. ఈ కారణంగా తిరుపతి జిల్లాకే చెందిన ఎస్సీవీనాయుడుకు ఈ పదవి దక్కలేదు. శాసనమండలిలో స్థానం కల్పించక పోవడం వైసీపీకి తీరని నష్టం కలుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధిష్టాన నిర్ణయంతో ఎస్సీవీ నాయుడు మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్సీవీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల జనసేన పార్టీ ఎస్సీవీని సంప్రదించి తమ పార్టీ తరపున శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలని కోరినట్లు తెలిసింది. అదేవిధంగా సొంత పార్టీ టిడిపి ఎస్సీవీ రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది. కాదు ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్గా పోటీ చేసే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో ఎస్సీవీ నాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతారో వేచి చూడాల్సిందే మరి. ఏదిఏమైనా సత్రవాడ, సిపాయి కుల రాజకీయం మధ్య ఎస్సీవీ బలయ్యారని చర్చ నడుస్తోంది.

మోటార్లకు మీటర్లను పగలగొట్టండి

చక్కెర పరిశ్రమలకు పూర్వవైభవం తెస్తాం / యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఆశీర్వదిస్తున్న నైనారు పొన్నారావు

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే మొహమాటం లేకుండా పగులగొట్టాలని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ రైతులకు పిలుపునిచ్చారు. రైతు పక్షపాతి ప్రభుత్వామంటూ గొప్పలు చెప్పుకుంటున్న సీఎం జగన్ ఏటా రైతు తలపై రూ.2.50 లక్షల తలసరి అప్పును మోపుతున్నాడనీ, ఆ పాపం ఎవరిదని ధ్వజమెత్తారు. లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర 24వ రోజైన బుధవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని ఏర్పేడు మండలంలో కొనసాగింది. ఇందులో భాగంగా నారా లోకేష్ మడిబాక, మునగలపాలెం, వికతమాల, పాపానాయుడుపేట గ్రామాల రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు పలు సమస్యలను నారా లోకేష్ దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే రైతులకు ఉరి తప్పదన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ లేకుండా చేయాలనే దుర్బుద్ధితోనే జగన్ ప్రభుత్వం మోటార్లకు మీటర్లు బిగిస్తోందన్నారు. ఈ విధానాన్ని ప్రతి రైతూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయంలో రైతులకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25కోట్లు బకాయి ఉందన్నారు. ఈ బకాయి చెల్లించక పోవడంతో మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి మొగ్గు చూపడం లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరు చక్కెర పరిశ్రమలకు పూర్వ వైభవం తెస్తామని హామీ ఇచ్చిన జగన్, అధికారం చేపట్టాక ఐదింటిని మూయించారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెరకు రైతులకు రూ.63కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ చక్కెర పరిశ్రమలను శాశ్వతంగా మూతవేసి, ఆ భూములను అమ్మేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా చక్కెర పరిశ్రమలకు పూర్వ వైభవం తెస్తామన్నారు. చక్కెర పరిశ్రమల వారు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సహా చెల్లిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. రైతులు వచ్చే సాధారణ ఎన్నికల్లో టిడిపి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం లోకేష్ రేణిగుంట మండలం జి పాలెం చేరుకుని అక్కడే రాత్రి బస చేశారు. మార్గమధ్యలో ఏర్పేడు మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ నైనారు పొన్నారావు లోకేష్ ను ఆశీర్వదించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ధనుంజయులనాయుడు, మునిక్రిష్ణమనాయుడు, మల్లిఖార్జుననాయుడు, సత్రవాడ ప్రవీణ్, రవీంద్రనాథరెడ్డి, చెంచయ్యనాయుడు, ప్రకాశ్ నాయుడు, శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువగళంలో కరపత్రాల వివాదం

టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో కరపత్రాల వివాదం రాజుకుంది. లోకేష్ యాత్ర ఏర్పేడు మండలం మర్రిమందకు చేరగానే అక్కడి కొందరు వైసీపీ కార్యకర్తలు టీడీపీకి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలు వెదజల్లారు. దీంతో ఇరుపార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య వివాదం జరిగింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని కరపత్రాలు వెదజల్లిన వైసీపీ కార్యకర్తలను సమీపంలోని పాఠశాల గదిలోకి తీసుకెళ్లి తాళాలు వేశారు. టీడీపీ కార్యకర్తలు అక్కడకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది. వైసీపీ వారు ఉద్దేశ్య పూర్వకంగా వివాదం సష్టించడానికి ఇలా చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.

నేడు జాబ్ మేళా

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్యలో 23వ తేదీ గురువారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగులైన యువతీయువకులకు పలు అంశాలలో మొబిలైజేషన్ చేసి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వారికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎం శివ తెలిపారు. మండలంలో పదవ తరగతి నుండి డిగ్రీ వరకు చదివిన నిరుద్యోగ యువతీయువకులు జాబ్ మేళాకు హాజరై అర్హతను బట్టి శిక్షణకు ఎంపిక కావచ్చునని, మరిన్ని వివరాలకు ఆయా పంచాయతీ పరిధిలోని సంఘమిత్రలను, సీసీలను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనాలు వేలం

ప్రజాశక్తి- సోమల: సోమల పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి రెండు ద్విచక్రవాహనాలను ఎంవిఐ వారి ఆధ్వర్యంలో పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు వేలం వేయబడునని, ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనవచ్చునని సోమల పోలీసులు వారు తెలిపారు.

'స్పందన' వినతులను వెంటనే పరిష్కరించాలి

జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: స్పందనలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని తిమ్మోజిపల్లి గ్రామసచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం నవరత్నాలు పలు సంక్షేమపథకాలను ప్రారంభించిందని వీటిలో ప్రతిఒక్క లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందేవిధంగా చూడాలని ఉద్దేశ్యంతో నూతన సచివాలయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామ వాలంటీర్లు సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం సిబ్బంది హాజరు, మూవ్మెంట్, సివిల్ రిజిస్టర్లు, స్పందన, సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నూర్‌అహ్మద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి, సంక్షేమం సీఎంకు రెండు కళ్ళు'

ప్రజాశక్తి- పుంగనూరు: అభివృద్ధి, సంక్షేమం రాష్ట్ర ముఖ్యమంత్రికి రెండు కళ్ళుగా ప్రభుత్వపాలన కొనసాగిస్తున్నారని దళిత సంఘం నాయకులు రాజు అన్నారు. బుధవారం పుంగనూరు పట్టణ దళిత సంఘ నాయకులు ముఖ్యమంత్రి, మంత్రి పెద్దిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎస్సీ, ఎస్టీ, బిసి, ఓసి మైనార్టీ సంఘాల అభివృద్ధికి పెద్దపీట వేశారని అన్నారు. చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను అభ్యర్థిగా ఖరారు చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. సిపాయి సుబ్రహ్మణ్యం కింది స్థాయి నుంచి ఎంతో ఉన్నతస్థాయికి ఎదగడమే కాకుండా ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారన్నారు. కార్యక్రమంలో కృష్ణప్ప, చిన్నరాయుడు, శంకరప్ప, పిఎంపి డాక్టర్ల సంఘం సభ్యులు ఎన్.అమర్నాథ్, మునిరత్నం, లక్ష్మీనారాయణ, బాబు, హరిప్రసాద్, సురేష్, రామచంద్ర దళిత సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గృహప్రవేశాలపై సమీక్ష

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని సామూహిక గృహప్రవేశాలు పనుల పురోగతిపై హౌసింగ్ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల కార్యాలయంలో ఎంపీడీవో సుధాకర్‌రావు అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలానికి కేటాయించిన గృహాలు నిర్మించిన సమయంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి, పూర్తిచేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ డీఈ, ఏఈ, ఈవోఆర్‌డి, ఏపీఓ, ఏపిఎం, ఐసిడిఎస్ సూపర్వైజర్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్ రావు

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో లాభం


ప్రజాశక్తి–పెద్దపంజాణి: రైతులు తమ వ్యవసాయ పనులు ఆధునిక పనిముట్లను పద్ధతులను ఉపయోగించడం వల్ల అధిక లాభం పొందవచ్చు అని మూగ్రో అవుట్లెట్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. బుధవారం రాజుపల్లి సమీపంలో మూగ్రో అవుట్లెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు కావలసిన దానా, డెయిరీ పరికరాలు అలాగే రైతాంగానికి కావలసిన ఎరువులు, ఆధునిక వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచి తక్కువధరలకు రైతులకు అందించడమే మూగ్రో ప్రధాన ఉద్దేశ్యమని డైరెక్టర్ రామకష్ణ అన్నారు. గ్రామీణ ప్రాంత రైతులు ఒకసారి తమ లేఔట్‌న్ సదర్శించి ఆధునిక పనిముట్లు పరిశీలించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించి ఇక్కడున్న నైపుణ్యత సిబ్బందితో పాడి, వ్యవసాయ రంగంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి సలహాలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మూమార్క్ ఆపరేషన్ నిర్వహణ అధికారి సతీష్, అశోక్, అనిల్, మంజునాథరెడ్డి, రైతులు భాను ప్రతాప్‌రెడ్డి, నాగరాజ్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



మాగ్రో అవుట్లెట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ రామకృష్ణ

'వైఎస్సార్‌సీపీ పేదల ప్రభుత్వం'

ప్రజాశక్తి –పాలసముద్రం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సారథ్యంతో పేదల కోసం పనిచేసే ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.శివ ప్రకాష్‌రాజు, జడ్పిటిసి అన్బలగన్ తెలిపారు. బుధవారం మండలంలోని పార్టీ కార్యకర్తల సమావేశంలో ప్రకాష్‌రాజు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు హయాంలో లక్షల కోట్లు అప్పు చేసి వాటిని పేదప్రజల కోసం ఏ పథకానికీ అమలు లేదన్నారు. మండలంలో ఎన్నడూ చేయని విధంగా డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి చొరవతో అభివద్ధి పనులు చేస్తుంటే, చూసి టిడిపి నాయకులు ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని మండిపడ్డాడు. టిడిపి నాయకులు అభివద్ధి పనులకు ఆటంకం జరగకుండా సహకరించాలి తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రం వారివారి పార్టీలకు వారు పనిచేయాలి ఎన్నికలు ముగిసిన తర్వాత అందరూ కలిసికట్టుగా ఉండి మండలను అభివద్ధి చెందేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల బిసి వడ్డెరకుల అధ్యక్షుడు వేణు, మండల కన్వీనర్ తులసీ యాదవ్, ఎంపీటీసీ గోవిందరాజులు, సర్పంచ్ అయ్యప్ప, రైతు భరోసా కేంద్రం ఛైర్మన్ పోలయ్య, కార్యకర్తలు షణ్ముఖ రెడ్డి, మనోహర్, ప్రకాష్, బాబు, త్యాగరాజ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివ ప్రకాష్ రాజు

దళితులు అన్నదానం చేయకూడదా..?

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు



ప్రజాశక్తి- పలమనేరు : దళితులు అన్నదానం చేయకూడదని ఏ రాజ్యాంగంలో ఉందని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డివి.మునిరత్నం, వేలాయుధం రాజేశ్వరి ప్రశ్నించారు. బుధవారం పలమనేరుపట్టణంలో జాతీయ మానవహక్కుల కార్యాలయంలో పార్థసారధి అధ్యక్షతన ప్రజాసంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలానికి చెందిన జెపి వెల్‌నెస్ ఫౌండేషన్, జైప్రకాష్ ఆధ్వర్యంలో శాంతిపురం మండలం కుప్పం జాతీయ రహదారిపై జనవరి 18న పేదలకు అన్నదానం చేస్తుంటే చూసి ఓర్వలేని అగ్రకుల పెత్తందారులు జనవరి 24న అన్నదాన శిబిరాన్ని ధ్వంసం చేయడం సిగ్గుచేటు అన్నారు. రాజ్యాంగంలో ఏ కులస్తులైనా మతస్తులైనా ఆకలితో అలమటిస్తున్న కడు నిరుపేదలకు సేవా ఆకలి తీర్చే హక్కు ఉందని దాన్ని ప్రశ్నించే హక్కు అగ్రకుల అహంకారులకు లేదనే విషయం గమనించాలన్నారు. దేశంలో అనేకమంది పేదలు ఇప్పటికీ రెండు పూటలు చాలీచాలని తిండి తిని కాలం గడుపుతున్నారని అటువంటి వారికి అన్నదానం చేయలేని కుల దురాహంకారులు దానం చేసేవారిని చూసైనా నేర్చుకోవాలని హితవు పలికారు. అమ్మ పెట్టకూడదు అడుక్కొని తినకూడదు అన్న చందంగా వ్యవహరించడం చూస్తుంటే సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు అన్నదానం చేస్తున్న జేపీ ఫౌండేషన్ వారిని అడ్డకోవడం ముమ్మాటికి మానవహక్కుల ఉల్లంఘన అవుతుందని, అలాంటివారికి చట్టంలో కఠినంగా సెక్షన్లను నమోదు చేసి శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రోజు అల్లరిమూకలతో అన్నదానాన్ని నిర్వీర్యం చేయాలనుకుంటే పోరాటాలతోనే సమాధానం చెప్తామని హెచ్చరించారు. ఇటువంటి అనాగరిక చర్యలను మేధావులు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాలు కార్మికులు కర్షకులు ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు హేమావతి, శ్యామల, రిటైర్డ్ ఉద్యోగుల నాయకులు, రాజమణి, బిల్డింగ్ అసోసియేషన్ రవి, రైతు సంఘం సుబ్రహ్మణ్యం, పాల ఉత్పత్తిదారుల సంఘం రత్నప్ప, ఆటో సంఘం సురేష్, డప్పు కళాకారుల సంఘం బాలాజీ పాల్గొన్నారు.

డీలర్లు డీడీలు సకాలంలో కట్టాలి: తహశీల్దార్

ప్రజాశక్తి –పాలసముద్రం: ప్రభుత్వం తెల్లరేషన్ కార్డులకు పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులకు డీలర్లు డీడీలను సకాలంలో కట్టాలని తహశీల్దార్ బాబు తెలిపారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో మండల పరిధిలోని చౌకదుకాణాల డీలర్లకు ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధన మేరకు నిత్యావసర సరుకులకు డీడీలు సకాలంలో కట్టి నిత్యావసర సరుకులు సక్రమంగా అందించాల్సిన బాధ్యత సంబంధిత డీలర్లపై ఉందని తెలిపారు. మండలంలో కొన్ని గ్రామాల్లో నిత్యావసర సరుకులు సక్రమ మండలి లేదని ఫిర్యాదులు వస్తున్నది అలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు, ముఖ్యంగా తూకాల్లో తేడాలు రాకుండా చూడాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ బాబు

పోలవరం ప్రాజెక్టుకు నిధులివ్వండి

ఢిల్లీలో కేంద్ర మంత్రులకు వినతిపత్రం ఇచ్చిన రామచంద్ర యాదవ్




ప్రజాశక్తి–పుంగనూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొన్ని లక్షలమంది రైతుల కల అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు యువ నాయకుడు బోడే రామచంద్ర యాదవ్ వినతిపత్రం అందజేశారు. బుధవారం న్యూఢిల్లీలో ఆయన రాష్ట్రంలోని వివిధ సమస్యలపై కేంద్ర మంత్రులకు కలిసి వినతిపత్రాలు అందజేసి సమస్యలు పరిష్కరించాలని అభ్యర్థించారు. ఈసందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ దాదాపు 30 ఏళ్లు క్రితం పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా కేవలం రూ.2వేల కోట్లు నుంచి రూ.3వేల కోట్లతో ప్రాజెక్టు పూర్తి కావాల్సిందని, కేవలం రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారుల నిర్లక్ష్యంతోనే పూర్తి కాలేదని అన్నారు. 2014లో కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించినా రాష్ట్రప్రభుత్వ అలసత్వంతో పూర్తి కాలేదని చెప్పారు. కేంద్ర ఆర్థిక మంత్రి చొరవ తీసుకొని పోలవరం పూర్తి కావడానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాయలసీమలోని నంద్యాల జిల్లా సంగమేశ్వర నదిపై కేంద్ర ప్రభుత్వం నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జి వల్ల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతారని, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం అందించారు. ఐకానిక్ బ్రిడ్జ్ వల్ల కేవలం రవాణా సమస్య తీరుతుంది తప్ప రైతులకు ప్రయోజనం ఉండదని అన్నారు. ఐకానిక్ బ్రిడ్జి స్థానంలో రవాణా కోసం బ్రిడ్జి, రైతుల కోసం బ్యారేజ్ నిర్మిస్తే రాయలసీమలోని వేలాది మంది రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు వస్తుందన్నారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రతిపాదన పరిశీలించి ఏమాత్రం అవకాశం ఉన్న బ్రిడ్జ్ కం బ్యారేజ్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రధానంగా శేషాచలం అడవుల్లో జరిగే ఎర్రచందనం స్మగ్లింగ్ నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర అటవీశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కోరడం జరిగిందని చెప్పారు. రోజూ కోట్ల రూపాయల విలువచేసే ఎర్రచందనం స్మగ్లింగ్ అవుతోందని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై శ్రద్ధ చూపడం లేదని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దష్టి సారించి స్మగ్లింగ్‌పై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్ర సమస్యలపై వినతిపత్రం అందజేసిన ముగ్గురు కేంద్ర మంత్రులు సమస్యలను గురించి పూర్తిగా వివరించేందుకు అవకాశం ఇచ్చి, సానుకూలంగా స్పందించినందుకు రామచంద్ర యాదవ్ కతజ్ఞతలు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి



ప్రజాశక్తి- వెదురుకుప్పం: వీధికుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి గొర్రెల యజమాని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం బ్రాహ్మణపల్లిలోని ఎస్.నడిపిరెడ్డికి కొన్ని గొర్రెలు ఉన్నాయి. అవి 11 గొర్రె పిల్లలకు జన్మనిచ్చాయి. గొర్రెలు మేపుకు వెళ్లే సమయంలో వాటి పిల్లలను దొడ్డిలో వేశాడు. ఎవరు లేని సమయంలో 11 గొర్రె పిల్లలను వీధి కుక్కల దాడి చేయడంతో మతిచెందాయి. తరచూ వీధి కుక్కల వలన నష్టం జరుగుతూనే ఉందని, కనుక కుక్కల సమస్యల తీర్చాలని అధికారులను గ్రామస్తులు కోరారు.

సైన్సుపై అవగాహన సదస్సు



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని మోడల్‌స్కూల్ కమ్మనపల్లిలో ఐటీ మద్రాస్ వారి సహకారంతో బాలరాజు స్థానిక జెడ్పి ఉన్నత పాఠశాలలో పాఠశాలలోని విద్యార్థులకు సైన్స్‌పై అవగాహనలో సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా, జ్ఞాపక శక్తిని పెంపొందించే విధానాలను క్షుణ్ణంగా వివరించారు. జగదీష్. స్కూల్ హెచ్‌ఎం అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి- పులిచెర్ల: మండలంలోని వెంకటదాసరపల్లి పంచాయతీ జూపల్లివారిపల్లి సమీపంలో కోడిపందెం అడుతున్న ఐదుగురు వ్యక్తులకు అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. పోలీసులకు ముందుగా అందిన సమాచారం మేరకు జూపల్లివారిపల్లి సమీపంలో తనిఖీలు నిర్వహించారు. అక్కడ కోడిపందెం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ:2540లు నగదు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో పోలీసులు రషీద్, సురేష్ మురళి పాల్గొన్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులుగా రెడ్డిబాబు

ప్రజాశక్తి–తిరుపతి(మంగళం): జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులుగా సుంకర చిన్న రెడ్డిబాబును ఎన్నుకుంటూ రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. బుధవారం మంగళంలోని ఐక్యవేదిక కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్.గంగాధరం, సిబ్బాల వెంకటరమణ, ముద్దుశెట్టి శ్రీనివాసులు, సిబ్బాల రమేష్, నాగరాజు, జి. రామకృష్ణ, పవన్, తేజ పాల్గొన్నారు.

శ్రీరామ కళాశాలలో పోస్టర్ ప్రదర్శన

ప్రజాశక్తి–తిరుపతి(మంగళం): తిరుపతి–కరకంబాడీ రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ ఐడియాస్ ఇన్ టెక్నాలజీ, అగ్రికల్చర్–బిజినెస్" అనే అంశంపై పోస్టర్ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలోని 50 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభను కనబరిచారు. విద్యార్థులు తమ ప్రదర్శనని కళాశాలకు సంబంధించిన వివిధ విభాగాదిపతులకూ వివరించారు. విద్యార్థులు చేసిన ప్రదర్శలను చూసి ఉత్తమమైన మూడింటిని ఎంపిక చేశారు. కళాశాల ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు కృషి చేస్తున్నారన్నారు. ఉత్తమ ప్రదర్శనలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జయచంద్ర బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఐసి కన్వీనర్ ఎన్. వాసు, కో–కన్వీనర్ కుమారి, జమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

మనిషికి నేత్రాలు ముఖ్యం

సివిల్ జడ్జి కరుణకుమార్



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మనిషికి నేత్రాలే ముఖ్యమని సివిల్ జడ్జి కరుణ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్క్ వద్ద కంటి వైద్యశిబిరం మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్యశిబిరానికి ముఖ్యఅతిథిగా సివిల్ జడ్జి కరుణకుమార్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషికి నేత్రాలే ముఖ్యమని నేత్రాలకు చికిత్స చేసేందుకు తలపడుతున్న వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని చికిత్సలు చేసుకోవాలని అన్నారు. కంటి సమస్యలు ఉన్న వారికి ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేసి, ఉచితంగానే ఆపరేషన్, మందులు అందజేయడం జరుగుతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎంపీ వెంకటేశ్వర చౌదరి మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో 197మంది పరీక్షలు చేయించుకోగా అందులో 25మంది ఆపరేషన్‌లకు ఎంపికయ్యారని, వీరికి ఉచితంగా తిరుపతి అరవింద్ ఆసుపత్రిలో కంటివైద్యం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ పార్లమెంటు సభ్యురాలు దుర్గా రామకష్ణ, వైద్యులు డాక్టర్ లహరి, డాక్టర్ రచన, డాక్టర్ ఎన్‌పీ. మితిలేష్, నాయకులు కమల్నాదిరెడ్డి, సురేంద్ర నాయుడు, ధరణి, శ్రీనివాసులు, రవీంద్ర పాల్గొన్నారు.

బోడిపాటివారిపల్లిలో పొలంబడి



ప్రజాశక్తి- రొంపిచెర్ల: మండలంలోని బోడిపాటివారి పల్లిలో బుధవారం వైయస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఖాదర్‌వల్లి రైతులకు వరి పంటలకు తీసుకోవలసిన సంరక్షణ చర్యల గురించి తెలియజేశారు. అనంతరం పొలం పరిశీలన విశ్లేషణ ద్వారా పొలంలో చీడ పీడలు, మిత్ర, శత్రు పురుగుల వాటి ఉనికిని గుర్తించి వాటిని సస్యరక్షణ పద్ధతుల ద్వారా ఏవిధంగా నియంత్రించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు వెంకటరమణ నాయక్, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజాశక్తి–పులిచెర్ల: పాడి పశువుల అభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని పశువైద్యాధికారిణి రాణి తెలిపారు. మండలంలోని ఎర్రపాపిరెడ్డి గారిపల్లి ఆర్బీకే పరిధిలో 102 బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. లేగదూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పశువులకు పిడుదుల మందులు పిచికారి చేశారు. పాడి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి రాణి మాట్లాడుతూ వేసవికాలంలో పశువులకు వచ్చే జబ్బులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దానా సరైన మోతాదులో పశువులకు పెట్టాలని, లేగదూడల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామీణ రైతులు పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. సిబ్బంది అబూభాషా, ధనలక్ష్మి, నవ్య, దాము, పాడి రైతులు పాల్గొన్నారు.